ఈనాడు ఒడిశా
గురువారం అక్టోబరు 17, 2024

శ్రీక్షేత్రంలో సేవలకు
ఓంఫెడ్ నెయ్యి



గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ శ్రీక్షేత్రంలో జగన్నాథుని సన్నిధిలో 'ఓంఫెడ్' నెయ్యి దీపాలు మాత్రమే వెలిగించాలి. మహాప్రసాదం (ఒబడా), ఇతర ప్రసాదాలన్నింటికీ దీనినే వినియోగించాలి. ఇతర కంపెనీల నెయ్యి స్వామి సేవలకు వినియోగించరాదు' అని పాలనాధికారి అరవింద పాఢి స్పష్టం చేశారు. శ్రీక్షేత్రంలో కార్తిక సేవలు ప్రారంభం కాగా, మంగళవారం రాత్రి నీలాద్రి భక్తనివాస్‌లో 'సేవాయత్‌'లతో పాలనాధికారి సమావేశమయ్యారు. కార్తిక పౌర్ణమి వరకు నిర్ణీత వేళల్లో అన్ని సేవలు జరగాలని ఆదేశించారు. ఈ సందర్భంలో నెయ్యి వినియోగంపై కూలంకషంగా చర్చ జరిగింది. శ్రీక్షేత్రంలో దీపాలు, ఒబడా ప్రసాదాలకు రకరకాల నెయ్యి వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో కల్తీకి తావులేని ఓంఫెడ్ మినహా ఇతర కంపెనీల నెయ్యి ఉపయోగించొద్దని సేవాయత్‌లకు పాలనాధికారి ఆదేశించారు. సమావేశానంతరం ఓంఫెడ్ యంత్రాంగానికి అరవింద పాఢి లేఖ రాశారు. జగన్నాథుని సేవలకు అవసరమైన నెయ్యి సకాలంలో పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో తెలిపారు. పూరీలో ఈమేరకు ఓంఫెడ్ నెయ్యి డిపో ప్రారంభించాలని కోరారు.



ఉత్కళ వైభవానికి నిలువుటద్దం కుమార ఉత్సవాలు


దీపం వెలిగించి వేడుకలు ప్రారంభిస్తున్న మోహన్. చిత్రంలో ఇతర ప్రముఖులు

గోపాలపూర్, న్యూస్‌టుడే: ఏడాదిలోని పన్నెండు నెలల్లో 13 ఉత్సవాలు ఉత్కళ వైభవానికి నిలువుటద్దమని, జగన్నాథ సంస్కృతి ఔన్నత్యానికి ఈ వేడుకలు ప్రతీకగా చాటుతున్నాయని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి చెప్పారు. మంగళవారం రాత్రి పూరీ జిల్లా కేంద్రం చేరువలోని అలారపూర్ గ్రామంలో నవదుర్గ యువజన సంఘం ఆధ్వర్యంలో కుమార పౌర్ణమి మూడు రోజుల వేడుకలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న మోహన్ మాట్లాడుతూ... పురుషోత్తమ సంస్కృతి గొప్పదని, ఆధ్యాత్మికత, సద్భావన, అహింసలకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. కుమార పౌర్ణమి ఉత్సవ కర్త బాబా బలరాం గజలక్ష్మీ పూజల విశిష్టత, కుమార సంభవం గురించి విపులంగా వివరించారు. కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేడుకలు అలరించాయి. పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

నియమగిరిలో కాఫీ సాగు

జిల్లాలో ఆసక్తి చూపుతున్న డొంగిరియా గిరిజనులు

తొలివిడతగా 70 హెక్టార్లలో మొదలైన సాగు



ఆదిమ గిరిజన తెగకు (పీవీటీజీ) చెందిన డొంగిరియా కొంధో ప్రజలు నివసిస్తున్న నియమగిరి ప్రాంతంలో కాఫీ సాగు సందడి చేస్తోంది. జిల్లా యంత్రాంగం చొరవతో ఈ పంటపై ఇక్కడి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. తొలివిడతగా ఇప్పటికే 70 హెక్టార్లలో సేద్యం ప్రారంభమైంది. దీంతో నియమగిరి కొండల్లో పండే ఆనాస, పనస, పసుపు వంటి ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు, గిరాకీ లభించింది.

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే

నియమగిరి ప్రాంతంలో ఆనాస, పనస, పసుపు పంటల స్థానంలో ఇకముందు కాఫీ చేరనుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడి వాతావరణ పరిస్థితులు ఈ పంటకు అనుకూలంగా ఉండటంతోపాటు వీరి జీవనోపాధి మెరుగుపరిచేందుకు దోహదపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా వాటర్‌షెడ్ ప్రాజెక్టు సంచాలకుడు దయానిధి బాగ్ మాట్లాడుతూ.. బెంగళూరు నుంచి కాఫీ బోర్డు బృందం దీనిపై సమగ్ర అధ్యయనం చేశారని, నియమగిరి ప్రాంతంలో కాఫీ సాగుకు వాతావరణం అనుకూలంగా ఉన్నట్లు నిర్ధారించారన్నారు. దీనిపై స్థానికులకు అవగాహన కల్పించి ప్రోత్సహిస్తున్నట్లు బాగ్ పేర్కొన్నారు. ఈ ప్రాంతం సముద్ర మట్టానికి 850 మీటర్ల ఎత్తులో ఉండటంతో అరబికా రకం కాఫీ పంటకు అనుకూలంగా ఉందన్నారు. వాటర్‌షెడ్ డిపార్ట్‌మెంట్ తరఫున లబ్ధిదారులకు ఉచితంగా కాఫీ మొక్కలు, ఇతర సామగ్రి సమకూర్చుతున్నట్లు బాగ్ తెలిపారు.

120 మంది ప్రమేయం

రాయగడ జిల్లా బిసంకటక్ సమితి కుర్లి పంచాయతీ కంటేశు గ్రామంలో తొలివిడతగా 70 హెక్టార్లలో కాఫీ మొక్కలను నాటినట్లు వాటర్‌షెడ్ కార్యాలయ దస్త్రాలు పేర్కొంటున్నాయి. ఈ సాగువైపు మొత్తం 120 మంది డొంగిరియా ప్రజలు ఆసక్తి కనబరిచినట్లు కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. మొక్కలు నాటిన మూడేళ్ల తరువాత పంట చేతికొస్తుందని, ఇంతలో నల్లమిరియాలు వంటి సుగంధ ద్రవ్యాలను అంతరపంటగా సాగు చేసే వీలుందని వాటర్‌షెడ్ అధికారులు చెబుతున్నారు. కాఫీ సాగు ప్రోత్సాహకానికి రూ.70.49 లక్షల బడ్జెట్ కేటాయిస్తున్నట్లు ఆ శాఖ వర్గాలు వెల్లడించాయి. దీని జీవితకాలం దాదాపు 60 ఏళ్లు ఉండడంతో దీర్ఘకాలిక లబ్ధిచేకూరనుందని ధయానిది బాగ్ చేప్పారు. నిర్వహణ ఖర్చు సైతం చాలా తక్కువ. సాగుదారులకు నష్టాలు వచ్చే అవకాశాలు లేవు. కాఫీ సాగును మరింత విస్తృతం చేసేందుకు ఉద్యానశాఖతో సమన్వయం చేయడానికి ప్రయత్నిస్తున్నామని ఆయన తెలిపారు. పొరుగు జిల్లా కొరాపుట్‌లో కాఫీ పంటకు ప్రపంచ స్థాయిలో గిరాకీ లభించింది. ఈ నేపథ్యంలో మన జిల్లాలో దీన్ని పండించి డొంగిరియాలకు మరింత ప్రయోజనం చేకూరనుందన్న అభిప్రాయం పడుతున్నారు.


మొక్కకు కాసిన కాఫీ పండ్లు


నర్సరీలో కాఫీ మొక్కలు

పూరీలో సీసీ కెమెరాల నిఘా: పాలనాధికారి

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ అంతటా సీసీ కెమెరాలు అమర్చడానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక ఖరారు చేసి ప్రభుత్వ ఆమోదానికి పంపించినట్లు పాలనాధికారి సిద్ధార్థశంకర్ స్వయిన్ చెప్పారు. బుధవారం పూరీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... 600 లకు పైగా కెమెరాలతో పూరీపై నిఘా ఉంచుతామని, పోలీస్ కంట్రోల్ రూంతో ఇవి అనుసంధానమై ఉంటాయన్నారు.


సిద్ధార్థ్ శంకర్

సిరుల తల్లీ... కరుణించవమ్మా


ఢెంకనాల్ ప్రధాన రహదారిలో గజలక్ష్మి విగ్రహం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సిరుల తల్లి గజలక్ష్మి పూజలకు బుధవారం తెరలేచింది. దసరా వేడుకలు ముగిసిన తరువాత ప్రధాన నగరాలు, పట్టణాల్లో లక్ష్మీదేవి పెండాళ్లు ఏర్పాటయ్యాయి. గురువారం కుమార పౌర్ణమి కావడంతో దీనికి ముందు రోజు గజలక్ష్మి పూజలు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలకు ప్రసిద్ధ గాంచిన ఢెంకనాల్ జిల్లా కేంద్రంలో ఈ ఏడాదిలో 34 పెండాళ్లు ఏర్పాటయ్యాయి. ఉదయం కలశయాత్రతో వేడుకలు ప్రారంభం కాగా హోమం తరువాత విగ్రహాల ప్రాణప్రతిష్ఠ జరిగింది. నిలువెత్తు లక్ష్మీ పెండాళ్లు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. అనుగుల్, కేంద్రపడ, జగత్సింగ్‌పూర్, బాలేశ్వర్, కటక్, భువనేశ్వర్, పూరీ, ఖుర్దా తదితర నగరాలు, పట్టణాల్లోనూ గజలక్ష్మి ఆరాధన జరుగుతోంది. 11 రోజుల పాటు ఈ ఉత్సవాలు కొనసాగుతాయి. సాంస్కృతిక వేడుకలు, కుమార ఉత్సవాలు నేత్రపర్వం చేయనున్నాయి. రాష్ట్రంలోని తెలుగు ప్రాంతాల్లో నందెన్న, గౌరమ్మ సంబరాలు ప్రారంభమయ్యాయి.

అక్షరాస్యత పెంచేందుకు చర్యలు: నిత్యానంద

రాయగడ పట్టణం, మునిగుడ, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలన్నదే తమ లక్ష్యమని విద్యాశాఖ మంత్రి నిత్యానంద గోండ్ అన్నారు. బుధవారం రాయగడ జిల్లా బిసంకటక్ నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా మునిగుడ చేరుకున్న మంత్రికి భాజపా నేతలు, మహిళలు, పుష్పగుచ్ఛాలు ఇచ్చి హారతులతో స్వాగతం పలికారు. అనంతరం సమీప కూడలి వద్ద ఉన్న సహీద్ లక్ష్మణ్ నాయక్ విగ్రహానికి ఆయన పూలమాల వేశారు. అంబోదలలో జరుగుతున్న గజలక్ష్మి పూజల్లో పాల్గొని కలశ యాత్రను ప్రారంభించారు. ఆదివాసీ జిల్లాల జాబితాలో ఉన్న రాయగడలో అక్షరాస్యత శాతం పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మంత్రి గుర్తు చేశారు. ఆ దిశగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. మంత్రితో భాజపా జాతీయ ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి కాళీరాం మాఝి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మణ్ నాయక్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి గోండ్

హరియాణాకు సీఎం మోహన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి బుధవారం మధ్యాహ్నం హరియాణా ప్రయాణమయ్యారు. ఆ రాష్ట్రంలో భాజపా మూడోసారి అధికారానికొచ్చిన సంగతి తెలిసిందే. గురువారం కొత్త ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేయనుంది. ఈ వేడుకలో మోహన్ పాల్గొంటారు. అదేరోజు ఎన్డీయే భాగస్వామ్య పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాల సీఎంల సమావేశం హరియాణాలో జరగనుంది. ఇందులో సీఎం పాల్గొంటారు. అక్కడి నుంచి శుక్రవారం (18న) ముంబయి చేరుకుంటారు. ఈ వాణిజ్య నగరంలో ఏర్పాటయ్యే పెట్టుబడిదారుల సదస్సులో పాల్గొంటారు. 19 రాత్రి భువనేశ్వర్ చేరుకుంటారని ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) అధికారవర్గాలు బుధవారం తెలిపాయి.

నవీనే మా నేత.. పాండ్యన్ కాదు


భువనేశ్వర్, న్యూస్‌టుడే: బిజదలో అంతర్యుద్ధం కొనసాగుతున్న సమయంలో ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు దేవాశిష్ సామంత్రాయ్ బుధవారం భువనేశ్వర్‌లో విలేకరులతో మాట్లాడుతూ...నవీన్ పట్నాయక్ తమ నేత అని, పాండ్యన్‌ను తాము నాయకునిగా పరిగణించలేదని వివరించారు. దీనిపై కొందరు నేతలు చేస్తున్న వ్యాఖ్యలు నిందనీయమన్నారు. అమర్ ప్రసాద్ శత్పథి, ప్రసన్న పట్నాసీలు నవీన్ అనుగ్రహంతో ఉన్నత పదవులు పొందారన్నారు. అధికారమే పరమావధిగా చేసుకున్న వారు ఇప్పుడు ఆరోపణలు చేయడం తగదన్నారు. పాండ్యన్‌పై బురద జల్లడం కాదని, సాహసం ఉంటే నవీన్‌ను విమర్శించాలని సవాల్ విసురుతున్నానని సామంత్రాయ్ అన్నారు.


దేవాశిష్ సామంత్రాయ్

ఒడిశా సంస్కృతి, కళల పరిరక్షణ భేష్

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే

ఒడిశా సంస్కృతి, కళలు, సంప్రదాయాల పరిరక్షణకు 'మధుమాయా పాణిగ్రహి ఫౌండేషన్' చేస్తున్న కృషి అభినందనీయమని శాసన సభాపతి సురమా పాఢి అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుమార పౌర్ణమి సందర్భంగా బుధవారం నిర్వహించిన '15వ కుమార పునేయి జొహ్నాలో.. 2024' ఉత్సవాలు అంబరాన్నంటాయి. నగర శివారున ప్రభుత్వ ఐటీఐ ఆడిటోరియంలో జరిగిన ఈ వేడుకల్లో అతిథిగా పాల్గొన్న సురమా పాఢి మాట్లాడుతూ ఉనికి కోల్పోతున్న గ్రామీణ క్రీడలు, కళలకు ఊతమిచ్చేందుకు జరుగుతున్న ఉద్యమం అభినందనీయమన్నారు. ఉత్సవంలో పాల్గొన్న రాష్ట్ర, రాష్ట్రేతర కళాకారులు, బృందాలను ప్రశంసించారు. దక్షిణ ఒడిశా, గంజాం జిల్లా చారిత్రక వైభవానికి నిలయమని, పర్యాటక ప్రాంతాలు, కళల ప్రచారానికి అంతా ఉద్యమించాలన్నారు. 'నా జన్మభూమి గంజాం జిల్లా' అని పేర్కొన్న సురమా పాఢి మాతృభూమికి వందనమన్నారు. ఫౌండేషన్ ముఖ్యులు హృషికేష్ పాణిగ్రహి, సుదీప్త పాణిగ్రహి పర్యవేక్షణలో నిర్వహించిన ఉత్సవానికి బ్రహ్మపుర ఐజర్ అధికారి జయదేవ్ ముఖోపాధ్యాయ, దక్షిణాఫ్రికా ఓసీఏ వ్యవస్థాపక సభ్యుడు త్వింసంపతి జెనా అతిథులుగా పాల్గొన్నారు. ఉత్సవంలో వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన ముగ్గుర్ని సన్మానించారు.




మాట్లాడుతున్న ఒడిశా శాసన సభాపతి సురమా పాఢి, చిత్రంలో అతిథులు, నిర్వాహకులు

ఉర్రూతలూగించిన 'కుమార పునేయి జొహ్నాలో' వేడుకలు


పుణే నర్తకి అభినయం

అబ్బురపరిచే నృత్యాలు.. విన్యాసాలు

ఉత్సవంలో రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలకు చెందిన కళా బృందాల ప్రదర్శనలు ప్రేక్షకుల్ని అబ్బురపరిచాయి. శరత్ మహాపాత్ర్, శ్యామ్‌సుందర్ పాణిగ్రహి బృందం శంఖనాదంతో సాంస్కృతికోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఒడిశా, పశ్చిమబెంగాల్‌కు చెందిన గాయనీమణులు 'కుమార పునేయి జొహ్నాలో..' బృందగానం ఆలపించారు. యువ కళాకారిణి సంహిత పాణిగ్రహి (భువనేశ్వర్) నృత్యాలతో అలరించారు. పుణే (మహారాష్ట్ర)కు చెందిన ఆకాంక్ష ఒడిస్సీ నృత్యాయన రసిక గుమస్తె బృందం ఒడిస్సీ నృత్యాభినయంతో ఆకట్టుకుంది. గంజాం జిల్లా ధరమ్‌పూర్‌కు చెందిన శ్యామ్‌సుందర్ పాణిగ్రహి బృందం రామలీల జానపద నాటకంలో జటాయువు-రావణుడి యుద్ధ ఘట్టం ప్రదర్శించారు. కుట్టేశ్వర్ (ఛత్తీస్‌గఢ్)కు చెందిన దినేష్ జంగ్డే బృందం 'పంథి' నృత్య విన్యాసాలతో మైమరపించారు. గ్రామీణ క్రీడలకు అద్దంపట్టేలా బాలికలు నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక సంచిక ఆవిష్కరణోత్సవం నిర్వహించారు. ప్రేక్షకులందరికీ ఒడియా సంప్రదాయ పిండి వంటకం 'కకరా'ను పంచిపెట్టారు. డాక్టర్ సోనాలి సాహు, నిరంజన్ పల్టాలు ఉత్సవాలకు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. త్రిపతి బాలాజీ పాత్ర్, డాక్టర్ మిహిర్ కుమార్ త్రిపాఠి, డాక్టర్ అంబరీష్ పాఢి, సుజాతా పాఢి, డాక్టర్ బిశ్వనాథ్ పాణిగ్రహి, భగవాన్ మహరణా తదితరులు కార్యక్రమం నిర్వహణకు సహకరించారు.


ఛత్తీస్‌గఢ్ కళాకారుల నృత్య విన్యాసం


రామలీల నాటకంలో జటాయువు, రావణుడి యుద్ధం ప్రదర్శన

వలసలకు రాష్ట్రం చిరునామాగా మారింది. దీన్ని నియంత్రించడానికి ఇంతవరకు శాశ్వత కార్యక్రమాలు అమలు కాలేదు. ఈ దిశగా పాలకులు చిత్తశుద్ధి చూపలేదు. భాజపా ఎన్నికల మేనిఫెస్టోలో వలసల అంశం ప్రస్తావించి ఉపాధి కల్పనకు పెద్దపీట వేసి కార్మికులు ఇతర రాష్ట్రాలకు ఉపాధి కోసం వెళ్లే పరిస్థితి లేకుండా చేస్తామని పేర్కొంది. దీన్ని సాకారం చేయడంపై ఆ పార్టీ ఇప్పుడు దృష్టి సారించింది. టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది.


నిత్యం బొలంగీర్ స్టేషన్‌లో కనిపించే వలస కూలీలు

వలసల నివారణ సాధ్యమేనా?

అందరికీ ఉపాధి కల్పన ఎలా?

టాస్క్‌ఫోర్స్ ఏం చేయనుంది?

భువనేశ్వర్, న్యూస్‌టుడే

రాష్ట్రేతర ప్రాంతాల్లో ఒడిశావాసులు ఎంతమందున్నారు. అసంఘటిత రంగాల్లో పనులు చేస్తున్న వారి సంఖ్య ఎంత? అన్నదానిపై కార్మిక శాఖ వద్ద కచ్చితమైన వివరాల్లేవు. అనధికార వివరాల మేరకు సుమారు 20 లక్షల మంది సూరత్, అహ్మదాబాదు, ముంబయి, హైదరాబాదు, దిల్లీ, లక్నో తదితర నగరాల్లో ఉన్నారు. వలస వెళ్లేవారి పరంగా బొలంగీర్ అగ్రస్థానంలో ఉండగా రెండో స్థానంలో గంజాం జిల్లా ఉంది. కలహండి, నువాపడ, బౌద్ధ్ తదితర పశ్చిమ ప్రాంతాలవాసులు వలసపోతున్న వారిలో ఉన్నారు.

తరలిస్తున్న దళారులు

ఆకర్షణీయమైన ప్యాకేజీ, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని ఆశ చూపించి ఇతర రాష్ట్రాలకు కార్మికుల్ని తరలించడంలో దళారులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందుకోసం ఆయా కంపెనీలు వారికి కమీషన్లు చెల్లిస్తున్నాయి. పండగలు, శుభకార్యాలకు స్వగ్రామాలకు వస్తున్నవారు వేడుకలు పూర్తయిన తర్వాత మళ్లీ పనులు చేయడానికి తరలిపోతున్నారు. కొంతమంది అక్కడ వెట్టిచాకిరి చేస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితి కూడా లేకపోలేదు. దీనిపై కార్మిక శాఖకు తరచు ఫిర్యాదులందుతున్నాయి. శాసనసభలో పలుసార్లు చర్చ జరిగింది.

గత పాలకుల వైఫల్యం

వలసలకు అడ్డుకట్ట వేస్తామని ఇదివరకు బిజద పెద్దలు చెప్పారు. వారు అధికారంలో ఉన్న సమయంలో ఈ దిశగా ప్రయత్నాలు జరిగాయి. నవీన్ పట్నాయక్ ప్రభుత్వం వలస జిల్లాల్లో 'ఫోకస్' పంచాయతీల పేరిట ఉపాధి పనులకు పెద్దపీట వేస్తామని కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇది సాకారం కాలేదు. ఆయా జిల్లాల్లో ఎలాంటి కార్యక్రమాలు అమలు చేయలేదు. అప్పట్లో విపక్షంలో ఉన్న భాజపా ఈ పరిస్థితిపై దుయ్యబట్టింది.

స్పష్టత కరవు

మేనిఫెస్టోలో చెప్పింది చేస్తామంటున్న భాజపా పాలకులు ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్ అధ్యక్షతన వలసల నివారణకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), అభివృద్ధి కమిషనర్, ప్రభుత్వ శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శులంతా సభ్యులుగా ఉన్నారు. 6 నెలలకోసారి టాస్క్‌ఫోర్స్ సమావేశమవుతుంది. ఉపాధి కల్పన దిశగా చేపట్టనున్న కార్యక్రమాలు ఏవి? అన్నదానిపై ఇంతవరకు ఎలాంటి స్పష్టత లేదు. సోమవారం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వవర్గాలు ప్రకటించాయి. మంత్రులు, అధికారులెవరూ ఎలాంటి వివరాలు పేర్కొనలేదు.

'నరేగా' ఆధారమా?.. కేంద్రం అన్ని రాష్ట్రాల్లో ఉపాధిహామీ (నరేగా) కార్యక్రమం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. దీనికే ప్రాధాన్యమిచ్చి వలసలు నియంత్రించడం సాధ్యం కాకపోవచ్చు. మోహన్‌చరణ్‌మాఝి సర్కారు వలసపోతున్నవారి వివరాలు సేకరించాలి, కార్మికశాఖ ఈ దిశగా చిత్తశుద్ధి కనబరచాలి, బయట రాష్ట్రాలకు వెళుతున్న వార్ని విశ్వాసంలోకి తీసుకోవడం ప్రభుత్వానికి సవాల్ కావచ్చని పరిశీలకులంటున్నారు. నరేగాపైనే ఆధారపడకుండా ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లో సొంతంగా జీవనోపాధి కల్పించడానికి కార్యక్రమాలు ప్రారంభించాల్సి ఉందంటున్నారు.

బడ్జెట్‌లో కేటాయింపుల్లేవు



వలస కార్మికుల జిల్లాల్లో ఉపాధి కార్యక్రమాలు అమలు చేయడానికి ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో రూపాయి కేటాయించలేదు. ఈ నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి **సింగ్‌దేవ్** అధ్యక్షతన ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ కార్యాచరణ ప్రణాళిక ఖరారు చేసినా అమలు జరిగేదెలా అన్నది ప్పుడు చర్చనీయాంశమైంది.

ఘనంగా నవీన్ జన్మదిన వేడుకలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: నవీన్ నివాస్‌లో బిజద అధినేత జన్మదినం వేడుకలు ఆడంబరంగా నిర్వహించారు. బుధవారంనాటికి నవీన్‌కు 78 ఏళ్లు నిండాయి. 79వ వసంతంలోకి అడుగు పెట్టారు. నాయకులు, అభిమానులకు దూరంగా ఉండే ఆయన తన జన్మదినం వేడుకలకు ఎవర్నీ ఆహ్వానించేవారు కాదు. నిరాడంబరంగా జరుపుకునేవారు. ఈసారి దీనికి భిన్నంగా వేడుకలు జరిగాయి. తొలుత వివిధ విద్యాసంస్థల బాలబాలికలు నవీన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. వారికి ఆయన బహుమతులిచ్చారు. అనంతరం పార్టీ నాయకులు, అభిమానులొచ్చి అధినేతకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆశీస్సులందుకున్నారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ... ప్రజల సేవకు ప్రాధాన్యమివ్వాలని, వారితో మమేకమవ్వాలన్నారు. బిజద ప్రాంతీయ పార్టీ ధ్యేయం సేవ చేయడమే అన్న విషయాన్ని అందరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. ప్రజలు మనకు విపక్ష హోదా ఇచ్చారని, ఈ బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలన్నారు. నవీన్ జన్మదినాన్ని పురస్కరించుకుని బిజద నాయకులు అన్ని జిల్లా కేంద్రాల్లో రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆయన పేరిట ఆలయాల్లో పూజలు చేశారు.


నవీన్ నివాస్‌లో పిల్లలతో నవీన్ ముచ్చట


బాలునికి చాక్లెట్ ఇస్తున్న నవీన్


గజలక్ష్మీ నమోస్తుతే

గజలక్ష్మీ పూజలు ప్రారంభం కాగా, ప్రముఖ శిల్పి సుదర్శన్ పట్నాయక్ బుధవారం పూరీ తీరంలో అమ్మవారి సైకత శిల్పం తీర్చిదిద్ది శుభాకాంక్షలు తెలిపారు.

–న్యూస్‌టుడే, గోపాలపూర్



మండుతున్న కూరగాయల ధరలు



సిమిలిగుడ, న్యూస్‌టుడే: వ్యవసాయానికి అనుకూల ప్రాంతమైన కొరాపుట్ జిల్లాలో కూరగాయలు ఎప్పుడూ అందుబాటు ధరల్లో లభ్యమవుతుండేవి. ఇటీవల కాలంలో ధరలు పెరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్‌లో వీటి ధరలు చూసి గుండెల్లో దడ పుడుతోంది. దిగుబడి తగ్గడమే ఇందుకు ప్రధాన కారణమని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు రైతులు స్వయంగా నీటి సరఫరా చేస్తూ పొలంలో కూరగాయలు పండిస్తే పెద్దగా ప్రయోజనం లేకుండా పోతోందని రైతులు అంటున్నారు. అనంతరం పంటలు నిల్వ చేసేందుకు కోల్డ్ స్టోరేజీ వ్యవస్థ లేకపోవడంతో ఎంతకో కొంతకు అమ్ముకోవాల్సి వస్తోంది. దీంతో రైతులు కూరగాయల సాగుకు దూరమవుతున్నారు. బుధవారం సిమిలిగుడ మార్కెట్‌లో కూరగాయల కిలో ధరలు ఇలా ఉన్నాయి. వంకాయలు రూ.60, టమాటా రూ.100, బెండ కాయలు రూ.80, బీరకాయలు రూ.80, క్యాలిఫ్లవర్ రూ.100, క్యాబేజ్‌బుట్ట రూ.80, బీన్స్ రూ.120, కాకరకాయలు రూ.100, ఉల్లిపాయలు రూ.60, అల్లం రూ.120, బంగాళదుంపలు రూ.50, వెల్లుల్లి రూ.400 పలుకుతోంది. ఇటువంటి ధరలు ఎన్నడూ లేవని ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు.

కొరాపుట్ ఉత్పత్తులను ప్రశంసించిన మన్యం జిల్లా కలెక్టర్



లక్ష్మీపూర్‌లో తయారైన బుట్టలు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

సిమిలిగుడ, న్యూస్‌టుడే: ఆంధ్రాలో విజయనగరంలోని ఆంధ్ర గ్రామీణ అభివృద్ధి సంస్థ, విజయనగరం డీఆర్డీఏ, సెర్ప్ స్వచ్ఛంద సంస్థల సంయుక్తంగా ఇటీవల నిర్వహించిన అఖిల భారత బజార్ (సరస్ ఫైర్ -2024)లో వివిధ రాష్ట్రాల ఉత్పత్తులకు సంబంధించిన స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. కొరాపుట్ జిల్లా నుంచి గిరిజనుల ఉత్పత్తులు, పండిన పంటల స్టాల్‌ను ఓర్మాస్ సంస్థ ఏర్పాటు చేసింది. పార్వతీపురమన్యం కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, ఇతర అధికారులు కొరాపుట్ స్టాల్ వద్దకు చేరుకొని ఉత్పత్తులు చూసి సంతోషాన్ని వ్యక్తం చేశారు. గిరిజన మహిళల పనితీరు ప్రశంసించారు. మహిళా రైతులకు సాధికారత కల్పించేందుకు కొరాపుట్ జిల్లా యంత్రాంగం చేస్తున్న కృషిని కలెక్టర్ అభినందించారు.

సరిహద్దు గ్రామాల అభివృద్ధికి కృషి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: ఒడిశా-ఆంధ్ర రాష్ట్రాల్లోని సరిహద్దు గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని పొట్టంగి ఎమ్మెల్యే రామ్‌చంద్ర కడం అన్నారు. పొట్టంగి సమితికి చెందిన సరిహద్దు ప్రాంతాలైన తోలోగుల్లూరు, అంపావల్లి, సుంకి పంచాయతీల్లో ఆయన పర్యటించారు. అంపావల్లి వద్ద తోపెలి సిమెంట్ కర్మాగారాన్ని సందర్శించారు. కర్మాగార పనితీరు పరిశీలించి అధికారులతో మాట్లాడారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. కాలుష్యం నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేతో ఎంపీ ప్రతినిధి శుక్ర కోరా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాధు బంక, నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.



అంపావల్లిలో సందర్శించిన ఎమ్మెల్యే కడం

పరిమాలి గ్రామంలో దాహం కేకలు



గ్రామంలో నిర్మించిన కుళాయిలు

రాయగడ (గ్రామీణం), న్యూస్‌టుడే: రాయగడ జిల్లా కళ్యాణసింగుపూర్ సమితి పరిసర పంచాయతీ పరిమాలి గ్రామంలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంతమైన ఈ ఊరిలో డొంగరియా తెగకు చెందిన 22 కుటుంబాలు నివసిస్తున్నాయి. గతంలో సర్కారు చేసేందుకు వసుంధర పథకం ద్వారా గొట్టాలు అమర్చారు. వీటితో పాటు కుళాయి స్టాండ్‌పోస్టులు నిర్మించి రెండు ఏళ్ల అయినా నేటికి నీరు రాలేదు. గ్రామంలోని రెండు చేతిపంపుల్లో ఒకటి మాత్రమే పనిచేస్తుంది. నీరు కోసం దూరంగా ఉన్న నదికి వెళ్లాల్సి వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులకు విన్నవించినా ఫలితం లేదని అంటున్నారు.

వణికిస్తున్నా విషజ్వరాలు

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న చారద గ్రామంలో విషజ్వరాలు వణికిస్తున్నాయి. ఆ ఊరిలో చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ జ్వరాల బారిన పడుతున్నారు. గడిచిన వారం రోజుల్లో 20 మందికి పైగా వ్యాధి సోకింది. పారిశుద్ధ్యం పనులు చేపట్టకపోవడం ఈ పరిస్థితికి కారణమని గ్రామస్థులు అంటున్నారు. దీనిపై కొరాపుట్ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. సుజిత్ కుమార్ దాస్‌తో మాట్లాడగా త్వరలో ఆ గ్రామానికి వైద్యబృందాలను పంపి వ్యాధి నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు.



అధ్వానంగా పారిశుద్ధ్య పనులు

వంట కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని



వంట కార్మికుల సమావేశం

గుణుపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని విద్యాలయాల్లో మధ్యాహ్న భోజనాలు వండుతున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని గుణుపురం సమితి వంట కార్మికుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఆ సంఘం భవనంలో సమావేశం నిర్వహించారు. సంఘం సంయుక్త కార్యదర్శి త్రిపతి గమాంగ్ పాల్గొని మాట్లాడారు. మహిళా కార్మికులకు నెలకు 26 వేల జీతం ఇవ్వాలని, పలు విద్యాలయాలు మూత పడటంతో అందులో పనిచేసే కార్మికులకు వేరే చోట ఉపాధి కల్పించాలని, మూత పడిన విద్యాలయాలు తిరిగి తెరవాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వంట కార్మికుల సంఘం మహిళలు ముని సంబర, ముక్తి లత సంబర ఇతరులు పాల్గొన్నారు.

ఘనంగా నవీన్ పట్నాయక్ జన్మదిన వేడుకలు

రాయగడ, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ 78వ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం తేజస్వీ మైదానంలో బిజద కార్యకర్తలు జిల్లా కార్యాలయంలో కేకు కోసి పంచిపెట్టారు. రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా ఆసుపత్రి రక్తనిధి ఇన్‌ఛార్జి డాక్టర్ కె.నవీన్ సిబ్బంది హాజరై దాతాల నుంచి రక్తం సేకరించారు. మహిళలు, కార్యకర్తలు ,ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు.

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: బిజు జనతాదళ్ పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. శాసనసభ్యుడు రూపేష్ పాణిగ్రాహి అధ్యక్షతన గుసాని సమితి అర్ సీతాపురం వద్దనున్న జగన్నాథ్ నికేతన్ అనాథాశ్రమంలో ఈ వేడుకలు నిర్వహించారు.. అనంతరం వారికి అల్పాహారం అందజేసి వాళ్లతో కొంతసేపు ముచ్చటించారు. యువజన అధ్యక్షుడు శాసనం లింగరాజు, సమితి అధ్యక్షుడు ఎన్ వీర్రాజు, కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

★ పర్లాఖెముండి పట్టణంలోని రామ్‌నగర్‌లోని టీపి స్పెషాలిటీ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 18 యూనిట్ల రక్తం సేకరించినట్లు రక్తనిధి ఉద్యోగి ఖగేశ్వర్ బెహరా తెలిపారు.

నందన్న పూజకు వేళాయే .....

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండి పట్టణంలో నందన్న ఉత్సవాలు నేపథ్యంలో సందడి వాతావరణం నెలకొంది. గురువారం గౌరీ పౌర్ణమి సందర్భంగా పూజకు కావలసిన సామగ్రిని కొనేందుకు తరలివచ్చారు. దీంతో పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది.

అన్నదానం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సునాబెడలో వాణిజ్య సంఘం ఆధ్వర్యంలో అయిదు రోజులు పాటు దుర్గాపూజలు జరిగాయి. నిమజ్జనం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని పూజా కమిటీ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

డీపీ క్యాంప్‌లో సంఘ సేవకుల అవగాహన కార్యక్రమం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సునాబెడ పురపాలక సంస్థ పరిధి డీపీ క్యాంప్‌లో డెంగీ వ్యాధి వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో కొరాపుట్ రక్తదాతల సంఘం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సంఘం ప్రతినిధులు, సేవకులు షేక్ ఇబ్రహీం నేతృత్వంలో సభ్యులు సహదా పర్వనా, గోవింద వల్లభ పాడి, దుర్గాప్రసాద్ పాత్రో, స్వరాజ్ రాయ్, చింతామణి పృష్టి తదితరులు డీపీ క్యాంప్‌లో నివసిస్తున్న బెంగాలీ శరణార్థుల గృహాలకు వెళ్లి చైతన్యపరిచారు. పలు సూచనలతో కూడిన కరపత్రాలు పంపిణీ చేశారు. వ్యాధితో బాధపడుతున్న రోగుల పరిస్థితిని పరిశీలించారు. పారిశుద్ధ్యం లోపించడంతో డెంగీ ప్రబలతుందని గుర్తించారు. దీనిపై పురపాలక సంస్థ కార్యనిర్వాహక అధికారి నారాయణ నాయక్‌ను కలిసి సమస్యను వివరించారు.

దీపస్తంభాల వేడుకలు: ప్రముఖులకు ఆహ్వానాలు



ప్రభాతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న హరనాథ్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఈ నెల 19, 20 తేదీల్లో రాష్ట్రంలోని పూనీచ గోపాల్‌పూర్ పరదీప్, చంద్రబాగ, ఫాల్సపాయింట్, ప్రయాగీల్లోని దీపస్తంభాల్లో (లైట్‌హౌస్) రెండు రోజుల వేడుకలు జరగనున్నాయి. పూరీలోని తాలబణియాలో ఏర్పాటయ్యే ఉత్సవంలో కేంద్ర నౌకా రవాణా శాఖ మంత్రి శర్వనందసోనోవాల్ పాల్గొంటారు. గోపాల్‌పూర్‌లో ఉక్కుగనులు, వాణిజ్య రవాణాశాఖ మంత్రి బిభూతి భూషణ్ జెనా ముఖ్య అతిథి కానున్నారు. పూరీ వేడుకలు పరదీప్ పోర్ట్‌ట్రస్ట్ యంత్రాంగం చేపడుతోంది. ఈ నేపథ్యంలో ఓడరేవు, అధ్యక్షుడు. పి.ఎల్.హరనాథ్ బుధవారం భువనేశ్వర్ వచ్చారు. రాజ్‌భవన్‌లో గవర్నరు రఘుబర్‌దాస్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి ప్రభాతిపరిడ, ఇతర మంత్రులకు ఆహ్వాన పత్రాలు అందజేసి, వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

యువకుడిపై కత్తితో దాడి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: పెద్దబజారు పోలీసు స్టేషన్ పరిధిలో రంగుణిబొంధొ-కెవుటొవీధి కూడలిలో మంగళవారం రాత్రి అజిత్ నాయక్ (31) అనే యువకుడిపై కొందరు కత్తితో దాడి చేశారు. తీవ్రంగా గాయపడి రక్తం మడుగులో పడి ఉన్న ఆయనను పోలీసులు కాపాడి ఎమ్కేసీజీ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు విశాఖలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పాతకక్షల నేపథ్యంలో ఈ దాడి జరిగిందని బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం. బుధవారం విలేకరులకు చెప్పారు. ఈ కేసులో ఇద్దర్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు పేర్కొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా జోరిగావ్ సమితిలో ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందారు. మృతుడు చోటగూడ పంచాయతీ యువి-51 గ్రామానికి చెందిన సుబల్‌మహంతి(30) పోలీసులు గుర్తించారు. సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మృతికి గల కారణాలు తెలియవని, పరీక్ష నివేదిక వచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి వివరాలు వెల్లడిస్తామని ఎస్‌డీపీవో మధుసిక్త మిశ్రా తెలిపారు.

నీట మునిగి బాలుడు మృత్యువాత

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: స్నానానికి వెళ్లిన బాలుడు నదిలో మునిగి మృతి చెందిన విషాద ఘటన ఝూర్‌గ్రామ్ జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. జిల్లా పరిధిలోని బన్సురానయాగా గ్రామానికి చెందిన తాత, మనవడు రాహుల్ మంగళవారం మధ్యాహ్నం డులంగ్ నదిలో స్నానానికి వెళ్లారు. రాహుల్ మైతి స్నానం చేస్తూ నీటిలో కొట్టుకుపోయాడు. తాత రక్షించలేకపోయాడు. ఈ ఘటనను గమినించిన స్థానికులు నదిలో దూకి బాలుడ్ని బయటకు తీసి సమీపంలో ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందాడని ధ్రువికరించారు.

రహదారి ప్రమాదంలో ఒకరి దుర్మరణం

నవరంగపూర్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాయ్‌ఘర్ సమితి జమాడిహి గ్రామానికి చెందిన భువన్ హరిజన్ (23), పాత్రోకోటి గ్రామానికి చెందిన జగదీశ్ ద్విచక్రవాహనంపై నవరంగపూర్ వెళ్తున్నారు. ఉమ్మర్‌కోట్ ఠాణా పరిధిలో రాయ్‌ఘర్ రహదారి బెహడ గ్రామానికి బంగాళాదుంపలతో వెళ్తున్న ట్రక్కును వీరి బైకు దాటుతుండగా అటుగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొంది. ఘటనాస్థలంలో భువన్ మృతి చెందగా, జగదీశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. పరీక్ష అనంతరం పోలీసులు భువన్ మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు జగదీష్‌ను నవరంగపూర్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

ఏనుగు దాడిలో ఒకరికి గాయాలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఏనుగు దాడిలో వ్యవసాయ కూలీ గాయపడ్డాడు. ఝూర్‌గ్రామ్ జిల్లా నయాగ్రామ్ పరిధి జమాసోల్ ప్రాంతంలో మంగళవారం ఈ ఘటన జరిగింది. తీవ్రంగా గాయపడిన వ్యవసాయ కూలీ మృత్యుంజయ్ నాయక్‌ను స్థానికులు నయాగ్రామ్ ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ధూమా సాయి ప్రాంతంలో 80 నుంచి 85 ఏనుగుల గుంపు సంచరిస్తోంది. అందులో దారి తప్పిన ఒక ఏనుగు మృత్యుంజయ నాయక్‌పై దాడి చేసింది.

ఇరువర్గాల కొట్లాట

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా జరడా ఠాణా పరిధిలో ఖర్నిపడ పంచాయతీలోని గొటగావ్ గ్రామంలో మంగళవారం రాత్రి రామాయణం నాటకం ప్రదర్శన నేపథ్యంలో రెండువర్గాల మధ్య ఘర్షణలు జరిగాయి. నాటకం ప్రారంభమైన కొంతసేపటికి గ్రామానికి చెందిన రెండు వర్గాలు పరస్పరం కలహించుకోగా, ఐదుగురికి గాయాలయ్యాయి. వారిని పాత్రపురంలోని ఆరోగ్య కేంద్రంలో చికిత్సకు చేర్పించారు. తీవ్రంగా గాయపడ్డ ఇద్దర్ని స్థానిక ఎమ్కేసీజీ ఆసుపత్రికి స్థానాంతరం చేశారు. పోలీసులు ఈ ఘటనపై వివరాలు ఆరా తీస్తున్నారు.

పర్యాటకుల జీపు బోల్తా

మాచ్‌ఖండ్, న్యూస్‌టుడే: డుడుమా జలపాతం చూడటానికి వచ్చిన పర్యాటకులు జీపు బోల్తా పడి పలువురుకి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే సరిహద్దు ప్రాంతమైన అల్లూరిజిల్లా పెదబయలు మండలం బోండాపల్లి పంచాయతీ వెదిరిగుప్పకు చెందిన బాలన్నానాయుడుతో పాటు పలువురు డుడుమా జలపాతం చూసేందుకు కమాండర్ జీపులో వచ్చారు. మొదట జోలాపుట్ జలాశయం చూసి, అనంతరం డుడుమా జలపాతం వీక్షించేందుకు వెళ్తుండగా బురుడాయిల్ గ్రామం సమీపంలో మలుపు వద్ద జీపు అదుపుతప్పి బోల్తాపడింది. వాహనం కింద ఆర్లాబ్‌ఎర్రబుడ్డి ఉండిపోవడంతో శరీరభాగాలకు తీవ్రంగా గాయాలయ్యాయి. తక్షణం అటుగా వస్తున్న వాహన చోదకులు, జీపులో మిగిలిన వారు సహాయంతో ఎర్రబుడ్డిని బయటకు తీశారు. అనంతరం ప్రాజెక్టు ఆసుపత్రిలో చేర్చారు. ఈ ప్రమాదంలో గాయాలైన మరో 12 మందికి ప్రాథమిక చికిత్స చేశారు.

అబ్కారీ కానిస్టేబుల్‌పై దాడి: ఆరుగురి అరెస్టు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: స్థానిక టౌన్ ఠాణా పరిధిలో టెలీఫోను భవన్ సమీపాన ఓ విదేశీ మద్యం దుకాణం పక్కన అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యవహారాన్ని సాధారణ దుస్తుల్లో చరవాణిలో చిత్రీకరిస్తున్న అబ్కారీ కానిస్టేబుల్ సవ్యసాచి మిశ్రపై కొందరు సామూహికంగా దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఆరుగురు నిందితుల్ని అరెస్టు చేసి బుధవారం న్యాయస్థానానికి తరలించామని బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం. సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత దుకాణం వద్ద వివిధ విదేశీ బ్రాండ్లకు చెందిన రూ.2.5 లక్షల విలువ గల 500 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు.

నిందితుడిని అరెస్ట్ చేయాలని ఆందోళన

నవరంగపూర్, న్యూస్‌టుడే: పట్టణంలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఒక కిశోర బాలుడు మృతి చెందిన విషయం తెలిసిందే. బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాలని బుధవారం సాహి వాసులు, కుటుంబీకులు, త్రివేణి చౌక్ వద్ద బైఠాయించి ఆందోళన చేశారు. దీంతో నాలుగు గంటలు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఎస్‌డీపీవో మధుసిక్తా మిశ్రా, కృష్ణచంద్ర బొత్ర ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడి నిందితులను త్వరలో అదుపులోకి తీసుకుంటామని చెప్పారు.



మృతదేహం వద్ద నిరసనలో బైఠాయించిన సాహి వాసులు కుటుంబీకులు

ఫుల్టాలో బాంబు దాడులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా నిమ్మఖండి ఠాణా పరిధిలోని ఫుల్టా గ్రామంలో అశాంతి పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామానికి చెందిన రెండు వర్గాల మధ్య విభేదాలు తీవ్ర రూపం దాల్చాయి. ఒక వర్గానికి చెందిన వారు తన ఇంటిపై నాటు బాంబుతో దాడి చేశారని సర్పంచి మమతా నాహక్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. మరోవైపు బుధవారం గ్రామంలో సమావేశం నిర్వహిస్తుండగా, సమీపంలో బాంబు దాడి చేశారని మరో వర్గానికి చెందిన వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయా ఘటనల్లో నిజం ఎంతన్నది ఇంకా తెలియలేదని బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం. సాయంత్రం 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

సారా అక్రమ తయారీ కేంద్రంపై దాడి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా సదర్ ఠాణా పరిధిలో కొత్త బవుసియాపల్లి (డెంగాపదర్) గ్రామంలోని పాడుబడ్డ సామాజిక భవనంలో సాగుతున్న సారా అక్రమ తయారీ కేంద్రంపై మంగళవారం అబ్కారీ నిఘా విభాగం (బ్రహ్మపుర) అధికారులు దాడి చేశారు. 500 లీటర్ల నాటుసారా, 1,400 సారా ప్యాకెట్లు (ఒక్కో ప్యాకెట్‌లో 100 మిల్లీలీటర్లు), 3,200 లీటర్ల సారా ఊట, ఓ ద్విచక్ర వాహనం, తదితరాలు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దర్ని అరెస్టు చేశామని ఆ విభాగం అధికారులు రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

17 జూద శిబిరాలపై దాడులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపుర పోలీసు జిల్లాలోని వివిధ ఠాణాల పరిధుల్లో గడచిన పది రోజుల్లో 17 చోట్ల సాగుతున్న జూద శిబిరాలపై దాడులు నిర్వహించి రూ. 6,07,960లు స్వాధీనం చేసుకున్నామని బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం. బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా దాడుల్లో 102 మందిని అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. వారి నుంచి 75 చరవాణులు, 23 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు.

బాధితులకు చరవాణులు అందజేత

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపుర పోలీసు జిల్లాలోని వివిధ చోట్ల పలువురి చరవాణులు పోయాయి. వీటిపై కేసులు నమోదు చేసుకున్న బ్రహ్మపుర సైబర్, ఆర్థిక నేరాల ఠాణా పోలీసులు పదిహేను చరవాణులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని బాధితులకు అందజేశామని బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం. మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

రాజయోగిని బ్రహ్మకుమారి మంజు కన్నుమూత



గిరిరోడ్డులోని శాంతికుండ్‌లో బ్రహ్మకుమారి మంజు భౌతికకాయం వద్ద పుష్పాలుంచి నివాళులర్పిస్తున్న బ్రహ్మకుమారీలు ఇతరులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బ్రహ్మపుర సబ్ జోన్ ఇనఛార్జి రాజయోగిని బ్రహ్మకుమారి మంజు (80) బుధవారం కన్నుమూశారు. అస్వస్థతతో ఎమ్కేసీజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె వేకువన 3.50 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆమె భౌతికకాయాన్ని ప్రజల సందర్శన కోసం గిరిరోడ్డులోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం శాంతికుండ్‌లో ఉంచారు. పలువురు బ్రహ్మకుమారీలు, ఇతరులు ఆమె అంతిమ దర్శనం చేసుకుని భౌతికకాయంపై పుష్పాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు. గురువారం ఉదయం బ్రహ్మకుమారి మంజు పార్థివదేహాన్ని ఊరేగింపుగా రామచంద్రపూర్‌లోని కేంద్రానికి తీసుకువెళతామని, అక్కడ మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహిస్తామని కేంద్రం ప్రతినిధి సాయంత్రం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. మీరట్ (ఉత్తరప్రదేశ్)కు చెందిన బ్రహ్మకుమారి మంజు 1986 నుంచి బ్రహ్మపురలో ఆధ్యాత్మిక సేవలు అందిస్తున్నారు.

సిద్ధార్థ్ సేవలు చిరస్మరణీయం



సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

గోపాలపూర్, న్యూస్‌టుడే: రక్షణశాఖలో జవానుగా జమ్ముకశ్మీర్‌లో విధులు నిర్వహించి అమరుడైన ఈ సిద్ధార్థ్‌సేవలు చిరస్మరణీయమని ఆర్మీ అధికారులు ప్రస్తుతించారు. గోపాల్‌పూర్‌కి చేరువలోని డీగిపురం గ్రామానికి చెందిన సిద్ధార్థ్ సెలవుల్లో స్వగ్రామానికి వచ్చి రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం డీగిపురంలో సంస్మరణ కార్యక్రమం జరిగింది. గోపాల్‌పూర్ ఎయిర్ డిఫెన్స్ గైడెడ్ మిస్సైల్ (ఏడీజీఎం) కేంద్రం అధికారులు, ఈ ప్రాంత ప్రముఖులు పాల్గొని, సిద్ధార్థ్‌కు శ్రద్ధాంజలి, ఘటించి ఆయనను అమర జీవిగా కొనియాడారు. ఈ సందర్భంగా సిద్ధార్థ్ కుటుంబ సభ్యులు మహా మృత్యుంజయం హోమం నిర్వహించారు.

నకిలీకాల్ సెంటర్ మూసివేత: ఆరుగురి అరెస్ట్



పినాకి మిశ్ర

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని సుందరపద ప్రాంతం పరిధిలోని కాంచన్‌టవర్ ఫ్లాట్ నెంబరు ఎ-205లో ఎయిర్‌ఫీల్డ్ ఠాణా పోలీసులు నకిలీకాల్ సెంటర్‌ను బుధవారం సీజ్ చేశారు. భువనేశ్వర్ డీసీపీ పినాకి మిశ్ర విలేకరులకు తెలిపిన వివరాల మేరకు... కాల్‌సెంటర్ పేరిట ఇక్కడ సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. కేంద్రం లోపల డివైస్‌లు, కంప్యూటర్లు, నకిలీ సింలు, ఇతర యంత్రసామగ్రి కనుగొన్నారు. ప్రాథమిక అధ్యయనం మేరకు ఈ కాల్‌సెంటర్ నుంచి సైబర్ నేరాలకు పాల్పడుతున్న కోల్‌కతా (పశ్చిమబెంగాల్)కు చెందిన ఆరుగురిని అరెస్ట్ చేశారు.

వలస కార్మికులకు విముక్తి

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: బొలంగీర్ జిల్లాకు చెందిన 18 మంది వలస కార్మికులకు కంటాబంజి పోలీసులు విముక్తి కలిగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శారదాపూర్ గ్రామానికి చెందిన కార్మికులను ఓ వాహనంలో తీసుకెళ్తుండగా డంగమర గ్రామ సమీపంలో అడ్డుకున్నారు. వీరంతా పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఓ ఇటుక బట్టీలో పని చేసినందుకు వెళుతున్నట్లు విచారణలో తేలింది. వాహన చోదకుడు ప్రదీప్ బెహరాను అదుపులోకి తీసుకుని, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కార్మికుల్లో నలుగురు పురుషులు, ఏడుగురు మహిళలు, మరో ఏడుగురు చిన్నారులు ఉన్నట్లు తెలిపారు.

దినసరి వేతనం పెంచాలని కూలీల ఆందోళన



రోజు వారి కూలీలతో పురాధ్యక్షుడు రాజేంద్ర

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సిమిలిగుడ మార్కెట్‌లో పనిచేస్తున్న కూలీల రోజువారి వేతనం పెంచాలని ఆందోళన చేశారు. స్థానిక షహీద్ కలాసీ సంఘం ఆధ్వర్యంలో కూలీలు మంగళవారం సాయంత్రం ధర్నా చేశారు. అంబేడ్కర్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వారంతా బైఠాయించి వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం సంఘం ద్వారా పొట్టంగి ఎమ్మెల్యే రామ్‌చంద్ర కడం, సునాబెడ పుర పాలక సంస్థ అధ్యక్షుడు రాజేంద్ర కుమార్ పాత్రోలకు వినతి పత్రాలు అందజేశారు. మార్కెట్‌లో బస్తాలు ఎక్కించి, దించేందుకు ఒక్కొక్క బస్తాపై రూ. అయిదు చొప్పున చెల్లిస్తున్నారని, రూ. 7 లకు పెంచాలని, పురపాలక సంస్థ ద్వారా సంఘం కార్యాలయం కోసం ఒక భవనం కేటాయించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ ఆందోళనతో మార్కెట్ పనులు ఆగిపోయాయి. పురపాలక సంస్థ అధ్యక్షుడు రాజేంద్ర కుమార్ పాత్రో మంగళవారం రాత్రి వారితో మాట్లాడి డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కమిషనర్‌తో సమీక్ష సమావేశం

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లాలో రాష్ట్ర క్రీడా, యువజన వ్యవహారాల శాఖ కమిషనర్ భాస్కర్ శర్మ రెండు రోజుల పర్యటన బుధవారం ముగిసింది. మంగళవారం వివిధ ప్రాజెక్టు ప్రాంతాల్లో [illegible] కార్యక్రమాలు, నిర్మాణ పనుల పని తీరు పర్యవేక్షించారు. జిల్లా పరిషత్ సభ్యులతో సమావేశమయ్యారు. పాలనాధికారి శుభంకర్ మహాపాత్ర, అదనపు పాలనాధికారి మహేశ్వర్ నాయక్ సీడీవో బిరంచినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ కళలు సంస్కృతి గొప్పది

సిమిలిగుడ, న్యూస్‌టుడే: ఆదివాసీ కళలు సంస్కృతి చాలా గొప్పదిని లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత అన్నారు. నియోజకవర్గం పరిధిలో దశమంత్‌పూర్ సమితి కుంటేష్ గ్రామంలో ఆదివాసీ యువకులు ద్వారా ఏర్పాటు చేసిన నాటిక ప్రదర్శనను ఎమ్మెల్యే మంగళవారం రాత్రి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నేటికీ ఆదివాసీ సంస్కృతికి ఆదరణ తగ్గలేదన్నారు. ఆధునిక పద్ధతిలో రామాయణం నాటిక ప్రదర్శన ఆకట్టుకుంది.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే పవిత్ర

నందన్‌కానన్‌కు గాయపడిన ఏనుగులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సుందర్‌గఢ్ జిల్లా రవుర్కెలా నగరానికి చేరువలోని బందుముండ అటవీ రేంజ్‌లో సోమవారం రాత్రి ఏనుగుల గుంపును అటవీ శాఖాధికారులు చెదరగొట్టి అడవికి పంపించిన సమయంలో రైలు పట్టాలపై గున్న ఏనుగు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో మరో రెండు ఏనుగులు గాయపడిన విషయం ఆలస్యంగా తెలిసింది. అడవిలో లేవలేని స్థితిలో ఉన్న ఈ వన్యప్రాణులను గుర్తించిన అటవీ శాఖ అధికారులు బుధవారం భువనేశ్వర్ నందన్‌కానన్‌కు తరలించారు. ఇక్కడ వాటికి చికిత్సలు అందిస్తారని జంతుప్రదర్శనశాల అధికార వర్గాలు తెలిపాయి.

27 నుంచి పరబ్-24 ఉత్సవాలు

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా లోకోత్సవం పరబ్-24 ఉత్సవాల నిర్వహణకు మంగళవారం స్థానిక సద్భావనా సభ మందిరంలో సన్నాహక సమావేశం జరిగింది. జిల్లాలో మారుమూల గిరిజన తాండాల్లో గల దాగి ఉన్న సంప్రదాయ, సాంస్కృతిక, క్రీడల్లో ప్రతిభావంతులను బాహ్యప్రపంచానికి పరిచయం చేసేందుకు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని పాలనాధికారి వి.కీర్తివాసన్ అన్నారు. పరబ్-24 ఉత్సవాలు దుధారి గ్రామంలోని మౌలిమ శక్తి పీఠం అక్టోబర్ 27 నుంచి ప్రారంభం అవుతాయని తెలిపారు. పరబ్-24 ప్రధాన ఉత్సవాలు రంగవల్లి కుంభగ్రామంలో డిసెంబర్14 నుంచి 18 వరకు జరిపేందుకు నిర్ణయించారు.

★ కొరాపుట్ జిల్లా రంగవల్లి కుంభ గ్రామంలో నిర్వహిస్తున్న లోకోత్సవం పరబ్-24 ప్రధాన ఉత్సవాలను ఈ ప్రాంతవాసులు కొందరు వ్యతిరేకించారు. గ్రామస్థులతో పాలనాధికారి వి. కీర్తివాసన్, ఎస్పీ రోహిత్ వర్మ మాట్లాడారు.

కుమార్తెను హత్య చేసిన తండ్రి

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: కన్నకూతురిని తండ్రి హత్య చేసిన ఘటన మల్కాన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి దోరగూడ పంచాయతీ ఆర్‌ఎస్‌సీ -14 గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే ఆర్‌ఎస్‌సీ -14 గ్రామానికి చెందిన సంజీవ్ భత్రా మొదటి భార్య మృతి చెందింది. వీరి కుమార్తె బ్లేసిరాణి భత్రా(5) సంజీవ్ తండ్రి వినోద్ భత్రా దగ్గర ఉండెది. సంజీవ్‌కు సంగిత పంగి అనే మహిళతో రెండో వివాహం జరిగింది. వీరిద్దరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. రెండో భార్య మాటలు విని సొంత కుమార్తెను బ్లేసిరాణిని బుధవారం ఉదయం కత్తితో పొడిచారు. చిన్నారి అరుపులు విని గ్రామస్థులు చిత్రకొండ ఆరోగ్యకేంద్రానికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందిందని తెలిపారు. ఈ సంఘటనపై సంజీవ్ తండ్రి వినోద్ చిత్రకొండ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కుమారుడుని, కోడలని కఠినంగా శిక్షించడంతో పాటు ఉరితీయాలని పోలీసులకు చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పరీక్ష అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. నిందితుడు పరారీలో ఉన్నాడు.

చిరుత కళేబరం స్వాధీనం



భువనేశ్వర్, న్యూస్‌టుడే: బరగఢ్ జిల్లా అంబాబన సమితిలోని ముండకటి గ్రామం రహదారిలో బుధవారం అటవీశాఖ సిబ్బంది చిరుత కళేబరం గుర్తించారు. గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెంది ఉంటుందని అనుమానిస్తున్నారు. ఈ వన్యప్రాణి వయసు ఏడాది ఉంటుందని, రెండు అడుగుల పొడవు ఉందని అధికారులు తెలిపారు

192 యూనిట్ల రక్తం సేకరణ



మాజీ శాసనసభ్యుడు బిక్రం పండాకు కేక్ తినిపిస్తున్న డాక్టర్ చ్యవుపట్నాయక్

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బిజద అధినేత, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ 78వ జన్మదినం సందర్భంగా బుధవారం బ్రహ్మపుర బిజు పరివార్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు జరిగాయి. ఉదయం ఆ పార్టీ నాయకులు బ్రహ్మపుర మా బుడి శాంతాణి ఠకురాణి (పెద్దమ్మవారు) మందిరంలో పూజలు నిర్వహించి నవీన్ దీర్ఘాయుష్షును కాంక్షిస్తూ దీపాలు వెలిగించారు. అనంతరం మొక్కలు నాటిన బిజద నాయకులు జూబ్లీ టౌన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కేకలను కోసిన వారు నవీన్ పట్నాయక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించగా, పలువురు వార్డు కార్పొరేటర్లు, బిజద నాయకులు, యువతరం పాల్గొని రక్తదానం చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ జరిగిన శిబిరాన్ని పర్యవేక్షించిన ఎమ్కేసీజీ రక్తనిధి సిబ్బంది దాతల నుంచి 192 యూనిట్ల రక్తం సేకరించారు. ఆయా కార్యక్రమాల్లో బిజద గంజాం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రమేష్‌చంద్ర చ్యవుపట్నాయక్, బీఈఎంసీ మేయరు మేయరు సంఘమిత్ర దొళాయి, ఉప మేయరు ఈ.వివేక్ రెడ్డి, పలువురు బ్రహ్మపుర మాజీ ఎంపీ చంద్రశేఖర సాహు, మాజీ శాసనసభ్యుడు బిక్రం కుమార్ పండా తాజా మాజీ కార్పొరేటర్లు, బిజద నాయకులు పాల్గొన్నారు.

భార్యను చంపిన వ్యక్తికి రిమాండ్


నిందితుడితో పోలీసులు

హుకుంపేట, న్యూస్‌టుడే: భార్యను చంపిన భర్తకు రిమాండ్ విధించినట్లు సీఐ సన్యాసినాయుడు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని నందాపూర్‌కు చెందిన లభకేముండు, పనాసంత దంపతులు హుకుంపేట మండలం గన్నేరుపుట్టు గ్రామానికి బతుకుతెరువు నిమిత్తం వచ్చారు. పనాసంత వివాహేతర సంబంధం పెట్టుకుందనే అనుమానంతో దంపతులు ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 13న లభకేముండు బయటకు వెళ్లి ఇంటికి వస్తుండగా.. గుర్తు తెలియని వ్యక్తి ఇంటి నుంచి వెళ్లడాన్ని గుర్తించి భార్యను ప్రశ్నించాడు. ఆమె గొడవకు దిగడంతో మద్యం మత్తులో భార్య మెడపై బలంగా నరకటంతో మృతి చెందింది. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారని, వారిని బాలల సంరక్షణ కేంద్రంలో ఉంచినట్లు పేర్కొన్నారు. ఎస్సై సురేష్ పాల్గొన్నారు.

నల్ల బియ్యం.. పోషకాలు ఘనం

తక్కువ పెట్టుబడితో సాగు చేస్తున్న బుడితి రైతు


బుడితి వద్ద వేసిన నల్ల బియ్యం పంట

న్యూస్‌టుడే, జలుమూరు, సారవకోట

తక్కువ పెట్టుబడితో నల్ల వరిని సాగు చేస్తే మంచి ఆదాయం వస్తుందని నిరూపిస్తున్నాడు సారవకోట మండలం బుడితి గ్రామానికి చెందిన రైతు మెండ మురళీకృష్ణ. అధిక పోషకాలు, ఔషధ గుణాలు అధికంగా ఉండే నల్లని వరి (బ్లాక్ రైస్) సాగుపై ఈయన ఆసక్తి కనబరుస్తున్నారు. గతేడాది ప్రయోగాత్మకంగా ఈ రకం సాగు చేపట్టారు. తనకు ఉన్న పొలంలో 20 సెంట్ల విస్తీర్ణంలో వేశాడు. పంట బాగా పండింది. ఈ ఏడాది 40 సెంట్ల విస్తీర్ణంలో పంట వేశాడు. కిలో విత్తనాలు రూ.400లకు ఆన్‌లైన్ ద్వారా 2 కిలోలు కొనుగోలు చేశారు. 40 సెంట్ల విస్తీర్ణంలో పంట వేశారు. 80 కిలోల బస్తాలు 8 వరకు దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఎటువంటి రసాయనిక, క్రిమిసంహారక మందులు వినియోగించకుండా సేంద్రియ వ్యవసాయం ద్వారా పండిస్తున్నారు. బస్తాకు 50 కిలోల బియ్యం వస్తాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో బియ్యం రూ.300 పలుకుతోంది. పెట్టుబడి రూ.20 వేల వరకు అవుతోంది. 400 క్వింటాళ్ల బియ్యం వస్తాయి. రూ.1,20,000 ఆదాయం వస్తోంది. పెట్టుబడి పోను రూ.లక్ష ఆదాయం వస్తుందని రైతు తెలిపారు.




ఇది లాభదాయకమే.. నల్ల బియ్యం పంట సాగు లాభదాయకమే. గత ఏడాది ప్రయోగాత్మకంగా వేశాను. మంచి దిగుబడి వచ్చింది. ఈ ఏడాది 40 సెంట్ల విస్తీర్ణంలో నాటాను. విత్తనాలు, నాట్లు వేసేందుకు, ఇలా పంట చివరికి వచ్చే వరకు రూ.20 వేల వరకు ఖర్చు అవుతుంది. సుమారు 8 బస్తాలు దిగుబడి వస్తుందని అంచనా వేశాను. పెట్టుబడి పోగా రూ.లక్ష వరకు ఆదాయం వస్తుంది. – మెండ మురళీకృష్ణ, రైతు బుడితి, సారవకోట మండలం

సస్యరక్షణ చర్యలిలా..

విత్తనం వేసే ముందు శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి. బి.పి.టి (బాపట్ల) 2841 రకం (సన్న బియ్యం) ఎంచుకోవాలి. ఎకరాకు 10 కిలోల వరకు విత్తనాలు వేసుకోవాలి. నాట్లు వేసే ముందు దమ్ములో ఎకరాకు 50 కిలోల డీఏపీ, యూరియా 15 కిలోలు, పొటాష్ 15 కిలోలు వేసుకోవాలి. కలుపు నివారణ మందులు పిచికారీ చేసుకోవాలి. రెండో పర్యాయంగా యూరియా 15 కిలోలు, పొటాష్ 15 కిలోలు వేసుకోవాలి. పురుగు మందులు అంతగా పిచికారీ చేయాల్సిన పనిలేదని. వ్యవసాయాధికారి కె.సి.హెచ్.వెంకటరావు తెలిపారు.



దోమపోటుతో వరిపైరుకు నష్టం


వీరభద్రాపురం వద్ద దోమపోటు సోకడం వల్ల పాడవుతున్న వరిపైరు

సరుబుజ్జిలి, పొందూరు, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్ వరి పైర్లపై దోమలు ఆశించి నష్టం కలిగిస్తున్నట్లు సరుబుజ్జిలి వ్యవసాయాధికారి బొడ్డేపల్లి పద్మనాభం తెలిపారు. వీటి నివారణ చర్యలు చేపట్టడంలో జాప్యం చేస్తే పంట నష్టం తీవ్రంగా ఉంటుంది. ఆ పైరు నుంచి అదొకరకమైన చెడువాసన రావడం వల్ల పశువులకు ఎండుగడ్డిగా కూడా ఉపయోగించడం వీలుకాదని రైతులు గుర్తించాలి. పొలానికి నత్రజని ఎరువును సిఫారసు మేరకే వాడాలి. దోమ ఉద్ధృతిని అనుసరించి శాస్త్రవేత్తలు సూచించిన పురుగు మందులను వాడుకుంటే సుడిదోమను నివారించవచ్చు. ● రైతులు చేయకూడని పనులు: సుడిదోమ ఉద్ధృతికి దోహదపడే పురుగు మందులు ప్రొఫెనోఫాస్, సైపరమిథ్రిన్, డెల్టామిథ్రిన్, ట్రైజోఫాస్, ఫోరట్ 10జి గుళికలు వాడరాదు. ముఖ్యంగా నత్రజనిని ఇచ్చే అధిక రసాయనిక ఎరువులు వినియోగించరాదు.

ఇలా చేస్తే మేలు..


కాండం తొలిచే పురుగు సోకడంతో ఎండిపోతున్న వంగ మొక్క చిగుర్లు

సారవకోట, పాతపట్నం, న్యూస్‌టుడే: వంగ పైరుకు కాండం తొలిచే పురుగు సోకి తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.సీ.హెచ్.వెంకటరావు తెలిపారు. పొలంలో గెత్తం వేసే సమయంలో ఎకరాకు రెండు కిలోల ట్రైకోడెర్మావిరిడి కలిపి వేస్తే జీవన ఎరువుగా మొక్కలకు అంది తద్వారా పురుగులు, తెగుళ్లు దూరమవుతాయి. కాండం తొలిచే పురుగు ఆశించినట్లు గుర్తించిన మొక్కల చిగుళ్లు తుంచి దూరంగా పారవేయడమో, గోతులు తీసి పాతడమో చేయాలి. ఎకరాకు కొరాజిన్ 60 గ్రా. పొడి మందును గాని, కార్టాప్‌హైడ్రోక్లోరైడ్ 400 గ్రా. మందును గాని 200 లీటర్ల నీటిలో కలిపి వారం, పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసి నివారించాలని ఏవో తెలిపారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

పంటల్లో దిగుబడులు పొందాలంటే ఏయే ఎరువులు వినియోగించాలి. వాటిలో ఎలాంటి యాజమాన్య పద్ధతులు పాటించాలి. పంటలను ఆశించే చీడపీడల నివారణకు ఎటువంటి చర్యలు చేపడితే మంచిదో ఆమదాలవలస కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.హరికుమార్ తెలిపారు. రైతులు చరవాణిలో అడిగిన ప్రశ్నలకు ఆయన ఇలా సమాధానాలిచ్చారు.

– న్యూస్‌టుడే, సరుబుజ్జిలి



ప్రశ్న: అరటిని ఆశించే పనామా తెగులు నివారణకు చర్యలు తెలియజేయండి. – బి.రామారావు, కుప్పిలి, లావేరు మండలం

సమాధానం: అరటిలో పనామా తెగులు విత్తన పిలకల ద్వారా వ్యాపిస్తుంది. అమృతపాణి రకం ఈ తెగులును తట్టుకోలేదు. తెల్లచక్రకేళి రకాలు కొన్ని ప్రతికూల పరిస్థితుల్లో దీనికి గురవుతాయి. దీనిని రసాయనాల ద్వారా నివారించడం సాధ్యపడదు. దీన్ని తట్టుకునే రకాలను ఎంచుకోవడం మేలు.

ప్రశ్న: బంతి మొక్కలు తలలు వాల్చి చనిపోతున్నాయి. నివారణకు చర్యలు తెలపండి. –కె.పద్మావతి, నరసాపూర్ అగ్రహారం, పొందూరు

సమాధానం: బంతిలో నారుకుళ్లు తెగులు నివారణకు లీటరు నీటికి కార్బండైజిమ్ 1 గ్రాము లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాముల చొప్పున కలుపుకొని మొక్కల మొదళ్ల వద్ద వేరు వ్యవస్థ తడిసేలా పోస్తే మొక్కలను కాపాడు కోవచ్చు.

ఈవీ హవా..!

- జిల్లాలో పెరుగుతున్న విద్యుత్తు వాహనాల వినియోగం
- కొనుగోలుకు ఆసక్తి చూపుతున్న ఉద్యోగులు, యువత

డబ్బు ఆదా

విద్యుత్తు వాహన వినియోగంతో రవాణా వ్యయం భారీగా తగ్గింది. లీటరు డీజిల్‌కు 16 నుంచి 17 కిలోమీటర్లు మైలేజీ ఇచ్చే కారుతో నెలకు సగటున మూడు వేల కి.మీ తిరిగితే కిలోమీటరుకు ఆరేడు రూపాయలు, పెట్రోల్ వాహనమైతే.. రూ.7 నుంచి రూ.8 వరకూ అవుతుందని తెలిపిన వినియోగదారులు అదే దూరానికి విద్యుత్తు కారు వినియోగిస్తే కి.మీకు రూ. 1.60 మాత్రమే అవుతుందని విద్యుత్తుశాఖ, నెడ్‌క్యాప్ అధికారులు చెబుతున్నారు. పెట్రోల్, డీజిల్ వ్యయంతో పోలిస్తే విద్యుత్తు వాహనం ఛార్జింగ్ ధర చాలా తక్కువ.

ద్విచక్రవాహనాలు	- 2,087
కార్లు	- 670
ఆటోలు	- 106
గూడ్స్ వాహనాలు	- 05
మోటార్ క్యాబ్స్	- 32


రైతుల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన విద్యుత్తు వాహనం

ఎచ్చెర్ల, రణస్థలం, న్యూస్‌టుడే: నిన్న మొన్నటి వరకూ పెద్ద పెద్ద నగరాలకే పరిమితమైన ఈవీ (విద్యుత్తు వాహనాలు) వినియోగం నేడు పట్టణాలతోపాటు పల్లెలకు కూడా పాకింది. జిల్లాలో రెండు మూడేళ్ల నుంచి వీటి కొనుగోళ్లు పెరుగుతుండటంతో షోరూంలు ఏర్పాటవుతున్నాయి. నిర్వహణ ఖర్చు సైతం తగ్గుతుండటంతో ప్రజలు వీటిపై ఆసక్తి చూపుతున్నారు.


కుశాలపురం బైపాస్ కూడలి వద్ద జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన షోరూం

వినియోగం పెరిగింది

గతంలో ఈవీ వాహనం నగరాల్లో కొద్ది మంది వినియోగించేవాళ్లు. గత మూడేళ్ల నుంచి ఈవీల వినియోగం పెరిగింది. నేను కుశాలపురం బైపాస్ కూడలిలో నెల రోజుల కిందట ఈవీ వాహనాల షోరూం ఏర్పాటు చేశాను. ఈ నెలలో మొత్తం 14 వాహనాలు అమ్ముడు పోయాయి.

– తామర రామారావు, వాహన షోరూం యజమాని

ఏర్పాటుకు రాయితీ..

ఇంజిన్ మోత లేకుండా, విద్యుత్తు చాలిత వాహనాలుగా విపణిలోకి వచ్చిన ఈవీలు క్రమంగా ప్రజాదరణ పొందాయి. ఆటోలు, స్కూటీలు, కార్లు జిల్లాలో ఎక్కడికక్కడ కనిపిస్తున్నాయి. ఈవీలతో డబ్బు ఆదా అవుతోందని వాహన యజమానులు చెబుతున్నారు. పెట్రోల్, డీజిల్‌తో నడిచే వాహనాలతో పోలిస్తే ఈవీలు కొంచెం ఖరీదైనా.. కొనేందుకు చూపుతున్నారు. అయితే జిల్లాలో ఎక్కడా ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులో లేకపోవడం ఒక లోటు. విద్యుత్తు ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటుకు భారీ ఖర్చు అవుతుందని అందుకే వెనకాడుతున్నట్లు షోరూం యజమానులు చెబుతున్నారు. తాజాగా ప్రభుత్వం రూ.3 లక్షల రాయితీ ప్రకటించనున్న నేపథ్యంలో ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తే వాహనదారులకు ఉపశమనం కలుగుతుంది.

చాలా ఉపయోగం..

నేను వీఆర్వోగా పని చేస్తున్నాను. నేను ఏడాది క్రితం ఈవీ వాహనాన్ని కొనుగోలు చేశాను. గతంలో వినియోగించే పెట్రోల్ వాహనానికి రూ. 150లు నుంచి రూ. 200 ఖర్చు అవుతుండేది. ప్రస్తుతం రోజంతా సుమారు 80 నుంచి 90 కిలోమీటర్లు ఒక్కోసారి వందకిలోమీటర్లు పైగా తిరుగుతున్నాను. కేవలం రోజుకు రూ. 20లు ఖర్చు అవుతోంది. నాలాంటి ఉద్యోగులకు ఈవీ చాలా ఉపయోగంగా ఉంటుంది.

గాయపడిన మరో కార్మికుడి మృతి

ఎలమంచిలి/ గ్రామీణం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మండలం లైనుకొత్తూరు పంచాయతీ పరిధి మర్రిబంద వద్ద ఈ నెల 5న ఇటుకల పరిశ్రమ ఆవరణలో కార్మికులు నివాసం ఉన్న షెడ్డులో గ్యాస్ లీకైన ప్రమాదంలో మరో కార్మికుడు బుధవారం మృతి చెందాడు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా సుహని గ్రామం శాంతినగర్‌కు చెందిన జి.కృష్ణారెడ్డి (40) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎలమంచిలి గ్రామీణ ఎస్సై ఉపేంద్ర తెలిపారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ముగ్గురు కార్మికులూ గాయపడగా, ఇప్పటికే ఇద్దరు మృత్యువాత పడ్డారు. చికిత్స పొందుతున్న మిగిలిన కార్మికుడు కూడా చనిపోవడంతో బాధిత కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. బాధిత కుటుంబాలకు యాజమాన్యం కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి చింతకాయల శివాజీ డిమాండ్ చేశారు.

గంజాయి పట్టివేత


డొంకరాయిలో గంజాయితో పట్టుబడిన వ్యక్తులతో ఎస్సై శివకుమార్, పోలీసుసిబ్బంది

మోతుగూడెం, న్యూస్‌టుడే: ఒడిశా రాష్ట్రం చిత్రకొండ బ్లాక్ నుంచి ద్విచక్ర వాహనంపై మూడు కేజీల గంజాయిని తరలిస్తుండగా డొంకరాయి పోలీసుస్టేషన్ వద్ద బుధవారం ఎస్సై శివకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన భీమా కడ, త్రినాథ్ కడతోపాటు ఇంతలూరు వాగుకి చెందిన కిలో పరమేష్‌లు ఒకే ద్విచక్ర వాహనంపై గంజాయిని తరలిస్తున్నారు. డొంకరాయి స్టేషన్ వద్ద వాహన తనిఖీ చేస్తుండగా వీరు పట్టుబడ్డారు. ఈ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

అంతరాష్ట్ర గొలుసు దొంగ అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: మహిళల మెడలోని బంగారు గొలుసులను చోరీ చేస్తున్న అంతరాష్ట్ర దొంగను పోలీసులు అరెస్టు చేశారు. కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో ఈ నెల 1న ఒకే రోజు నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో పుస్తెలతాళ్లను అపహరించిన కేసుల్లో ప్రధాన నిందితుడిని పట్టుకున్నట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఒడిశాలోని జాజ్పూర్‌కు చెందిన చిన్మయి ప్రధాన్ స్నేహితులు సంతోష్, బిజయ్, సంజయ్‌లతో కలిసి వజ్రపుకొత్తూరు, కాశీబుగ్గ, బారువ, కంచిలి పోలీసుస్టేషన్ల పరిధిలో ఇటీవల చోరీలకు పాల్పడ్డారని వివరించారు. వీరిపై ఒడిశా, పశ్చిమ బెంగాల్, అసోం, బిహార్ రాష్ట్రాల్లోనూ గొలుసుల దొంగతనం కేసులున్నట్లు చెప్పారు. చిన్మయ ప్రధాన్‌ను అరెస్టు చేశామని, మిగిలినవారు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితుడి నుంచి సుమారు 4.87 లక్షల విలువైన 6.5 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేసును ఛేదించిన అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, కాశీబుగ్గ గ్రామీణ, సోంపేట సీఐలు ఈశ్వరరావు, బి.మంగరాజు, కంచిలి, వజ్రపుకొత్తూరు ఎస్సైలు రాజేష్, నిహార్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు..!

కనీస వసతులు లేక లబ్ధిదారులకు ఇబ్బందులు



★ కవిటి మండలం కపాసుకుద్దిలో తెదేపా హయాంలో చేపట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణం శ్లాబు దశ వరకు వచ్చింది. వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. ఇక్కడి కేంద్రం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు.



★ ఇచ్ఛాపురం మండలం బూర్జపాడులో అంగన్‌వాడీ-1, 2 కేంద్రాల భవనాల నిర్మాణాలు నిధుల కొరతతో నిలిచిపోయాయి. రెండు కేంద్రాలు అద్దె ఇళ్లలో నిర్వహిస్తున్నారు. ఆరేళ్ల నుంచి ఇదే పరిస్థితి నెలకొనడంతో గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారు.

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే

మాతాశిశు సంరక్షణలో భాగంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం, ఆరు నెలల నుంచి ఆరేళ్ల లోపు వయసున్న పిల్లలకు ఆట పాటలతో కూడిన విద్య నేర్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు తిష్ఠ వేశాయి. కనీస సౌకర్యాలు లేని అద్దె భవనాల్లో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైకాపా ప్రభుత్వం నూతన భవనాల నిర్మాణాలను విస్మరించింది. ఐదేళ్లలో ఎక్కడా పనులు చేపట్టిన దాఖలాలు లేవు. సొంత భవనాల నిర్మాణంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి

ఇచ్ఛాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 260 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 138 కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. కనీస వసతులు లేక చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. తెదేపా హయాంలో ఇచ్ఛాపురం మండలంలో మొదటి దశ కింద 2016-17లో 25 భవనాలు మంజూరు కాగా 10 పూర్తయ్యాయి. శ్లాబు దశలో 9 ఉన్నాయి. పునాది దశలో 6 నిలిచిపోయాయి.

★ రెండో దశ కింద 2018-19లో 7 భవనాలు మంజూరు కాగా రెండు భవనాల పనులు ప్రారంభించారు. డొంకూరు-1, 3, కేశుపురం, బిర్లంగి-1, 3, భవనాల పనులు ప్రారంభించలేదు.

★ కవిటి మండలంలో మొదటి దశలో 29 భవనాలు మంజూరైతే 20 భవనాలు పూర్తి చేశారు. 8 భవనాలు శ్లాబు దశలో నిలిచిపోయాయి. బి.గొనపపుట్టుగలో పనులు ప్రారంభించలేదు. రెండో దశలో 9 భవనాలు మంజూరు కాగా శ్లాబు దశలో 7, చివరి దశలో ఒకటి, పునాది దశలో 1 నిలిచిపోయాయి. అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య కేంద్రాలను నడపాల్సిన దుస్థితి నెలకొంది.

ప్రభుత్వానికి నివేదించాం..

అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణాల పరిస్థితిపై ప్రభుత్వానికి నివేదించాం. అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ప్రాజెక్టు పరిధికి సంబంధించిన వివరాలు అడిగారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు కేంద్రాలను నిర్వహిస్తాం.

- పి.నాగరాణి, సీడీపీవో, ఇచ్ఛాపురం

అలరించిన దసరా పద్యాలు


పద్యాలు పాడిన వారికి బహుమతులు అందజేస్తున్న సమాజం ప్రతినిధులు, ఇతరులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: నగరంలోని 117 ఏళ్ల పైబడిన ఆంధ్ర మహిళా సమాజం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి మహిళలకు దసరా పద్యాలు, వినోద ఆటల పోటీలు నిర్వహించారు. సమాజం అధ్యక్షురాలు మోణింగి కామేశ్వరి అధ్యక్షతన జరిగిన ఇందులో పలువురు మహిళలు పాల్గొని దసరా పద్యాలు పాడారు. వారికి నిర్వాహకులు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సమాజం సభ్యురాలు ఈ.విమల తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలకు ప్రత్యేక తరగతులు

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు డీఈవో పగడాలమ్మ తెలిపారు. గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్తు పాఠశాలను బుధవారం సందర్శించిన ఆమె విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికతో చదివితే విజయం వరిస్తుందన్నారు. పరీక్షలంటే భయాన్ని వీడాలని సూచించారు. అనంతరం ఎమ్మార్సీలో ప్రధానోపాధ్యాయులతో సమావేశమై, వివిధ అంశాలపై చర్చించారు. నాడు-నేడు అసంపూర్తి భవనాల వద్ద ఎరుపు రంగు బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అపార్ నంబరు అనుసంధాన ప్రక్రియ జిల్లాలో 14 శాతం పూర్తయినట్లు చెప్పారు. డిప్యూటీ డీఈవో సుగుణ, ఎంఈవో చంద్రశేఖర్, ఏటీడబ్ల్యూవో సురేష్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు భీముడు తదితరులు ఉన్నారు.

శిథిల సేతువు.. ప్రమాద హేతువు!

ఆందోళనలో గిరిపుత్రులు

హరిపురం (మందస), న్యూస్‌టుడే

మందస మండలం చీపి-బుడంబొ కాలనీ మార్గంలో బొందుకారి వద్ద వంతెన శిథిలావస్థకు చేరింది. గోడలు విరిగిపోవడంతో సేతువు ప్రమాదకరంగా మారింది. ఏ క్షణాన కూలుతుందోని గిరిపుత్రులు ఆందోళన చెందుతున్నారు. వైకాపా హయాంలో మరమ్మతులు చేపట్టాలని పాలకులకు మొర పెట్టుకున్నా కన్నెత్తి చూడలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వంతెన పరిస్థితి మరింత దయనీయంగా మారడంతో రాకపోకల సమయంలో బెంబేలెత్తుతున్నారు.

★ మందస నుంచి చీపి మీదుగా బుడార్సింగి, మందస నుంచి బడంబొ మీదుగా సింగుపురం వెళ్లే రహదారులను అనుసంధానించి మూడు దశాబ్దాల కిందట ఈ రోడ్డు నిర్మించారు. ఈ మార్గంలో బొందుకారి, సవరరాజపురం మధ్య గెడ్డపై వంతెన నిర్మించారు. ప్రస్తుతం వంతెన మూడు గోడల్లో శివారు రెండు కుంగాయి. కొన్ని భాగాలు విరిగి పాడయ్యాయి.

★ చీపిలో ఆశ్రమ ఉన్నత పాఠశాల, బుడంబొలో పీహెచ్‌సీ, ఆశ్రమ బాలికోన్నత పాఠశాల ఉండటంతో ఈ మార్గం రద్దీగా ఉంటుంది. రహదారిపై రాళ్లు తేలి గోతులమయంగా మారింది. మరమ్మతులు, కొత్తగా వంతెన నిర్మాణానికి రూ.4 కోట్ల అంచనాతో అధికారులు ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. శిథిల వంతెన, రాళ్లు తేలిన రహదారిపై బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది.


ప్రమాదకర స్థితిలో వంతెన

15 గ్రామాలకు ఇబ్బంది



చీపి-బొందుకారి మధ్య గెడ్డపై వంతెన కూలితే 15 గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటారు. వైకాపా హయాంలో కొత్త వంతెన నిర్మించాలని అధికారులు, నేతలను పలుమార్లు అభ్యర్థించినా ఎవరూ పట్టించుకోలేదు.

-ఎస్.ధర్మారావు, ఆదివాసీ సంఘం మండల అధ్యక్షుడు

నిధులు లేవన్నారు..



గత రెండేళ్లలో వరదలకు వంతెన బాగా దెబ్బతింది. మళ్లీ వరద వస్తే కూలిపోయేలా ఉంది. రెయిలింగ్‌ల వద్ద బెర్మ్‌ల్లో గోతులు ఏర్పడ్డాయి. రహదారిపై గొయ్యి ఏర్పడటంతో ముప్పు పొంచి ఉంది. కొత్త వంతెన నిర్మించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్తే నిధులు లేవన్నారు. కూటమి నేతలు చొరవ చూపి మరమ్మతులు చేయించాలి.

-ఎస్.భాస్కరరావు, ఆదివాసీ వికాస పరిషత్తు సంఘం మండల సభ్యుడు

ప్రతిపాదనలు పంపుతాం..

చీపి-బుడంబొ రహదారి అభివృద్ధి, బొందుకారి వద్ద గెడ్డపై శిథిల వంతెనను తొలగించి కొత్త నిర్మాణానికి గతంలో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు చేయలేదు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి మళ్లీ ప్రతిపాదనలు పంపుతాం.

-ఎస్.శ్రీనివాసరావు, ఐటీడీఏ డీఈఈ, మందస